www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 9 ఆగస్టు 2025
చిత్తూరు

ప్రయాణికులను పట్టించుకోని ఆర్టీసీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కోట్లు ఖర్చుపెట్టి నిర్మించిన చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రధాన రహదారులు చెరువుల తలపిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వచ్చినప్పుడుల్లా వర్షపు నీటితోనిండిపోవడంతో ప్రయాణికులు బస్టాండ్ లోపల పోవడానికి కూడా వీలు లేని పరిస్థితుల్లో ఉన్నప్పటికీ అధికారులు చూసీ చూడనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో డివిఎం, డిఎం, సిటిఎం కార్యాలయాలు ఉన్నాయని, ఆఫీసు ముందు వర్షపు నీరు చెరువులను తలపించేలా నిల్వ చేరుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు దీనిపై దృష్టి సారించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి విసి గోపీనాథ్, మణి, దాసరి చంద్ర, పి.రఘు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు

- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- చిన్నకంపల్లి వద్ద కొట్టుకుపోయిన కల్వర్టు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఈనెల నాలుగో తేదీ నుండి వివిధ మండలాల్లో ఓ మోస్తారు నుంచి భారీ వర్షపాతం నమోదవుతోంది. నైరుతి రుతుపవనాల రాకతో జిల్లాలోని ఖరీఫ్ రైతుల్లో ఆనందం నెలకొంది. వేరుశనగ కోసం ఇప్పటికే దుక్కు దున్ని సిద్ధం చేసిన రైతులు వేరుశనగ విత్తనాలు విత్తేందుకు సిద్ధమవుతున్నారు. ఆగస్టు నెల 8వ తేదీ నాటికి జిల్లాలోని ఆరు మండలాల్లో ఇప్పటికే సాధారణ వర్షపాతం కంటే అత్యధిక వర్షపాతం, 11 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదయింది. 12 మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువ శాతం నమోదయింది. శుక్రవారం నాటికి సాధారణంగా కంటే అధిక వర్షపాతం నమోదైన మండలాలు పూతలపట్టు, చిత్తూరు రూరల్, పలమనేరు, యాదమరి, చిత్తూరు అర్బన్, గంగవరం మండలాలు ఉన్నాయి. నైరుతి రుతుపవనాలతో జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకల్లో వర్షపు నీరు పారుతోంది. పట్టణ ప్రాంతాల్లో లోతట్టు ప్రాంత ప్రజలు వర్షపు నీటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిత్తూరు నగరంలోని వీరభద్ర కాలనీ, రాంనగర్ కాలనీ లోతట్టు ప్రాంతాల్లో నగర మేయర్ అముద, నగర కమిషనర్ నరసింహ ప్రసాద్ పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు.

బంగారుపాళ్యంలో వర్షంతో రోడ్డుపై చెరువులను తలపిస్తున్న దృశ్యం

ఆగస్టు నెల నమోదైన వర్షపాత వివరాలు ఇలా ఉన్నాయి..

రొంపిచర్ల 64 .0 మిల్లీమీటర్లు, సదుం 105.6, పులిచెర్ల 101.0, వెదురు కుప్పం 36.2, నింద్ర 59.6, విజయపురం 104.0, నగిరి 32.8, కార్వేటి నగరం 82.6 ,పెనుమూరు 15.4, పూతలపట్టు 20.4 ,ఐరాల 54.0 ,సోమల 26.8, చౌడేపల్లి 30.0 ,పెనుమూరు 18.6 ,పెద్దపంజాణి 27.4 ,గంగవరం 44.2 ,తవణంపల్లి 41.4 ,ఎస్ ఆర్ పురం 51.2 ,జీడి నెల్లూరు 4.6 ,చిత్తూరు రూరల్ 41.2 ,పలమనేరు 59.6, బైరెడ్డిపల్లి 12.4 ,వీకోట 45.2 ,శాంతిపురం 12.2, గుడిపాల్ 359.6,గుడిపల్లి 2.6 ,కుప్పం 3.2 ,రామకుప్పం 28.6 ,బంగారు పాల్యం 30.0 ,యాదమరి 47.4, గుడిపల్లి 115.0, పాలసముద్రం 21.4, చిత్తూర్ అర్బన్ 57.0 మొత్తం 1136.0 36.6 శాతం.

చిన్నకంపల్లి వద్ద కొట్టుకుపోయిన కల్వర్టు.. దేవళకుప్పం వద్ద నిలిచిపోయిన రాకపోకలు

సోమల: మండలంలో శుక్రవారం దాదాపు రెండు గంటలసేపు కురిసిన భారీ వర్షానికి పెద్ద ఉప్పరపల్లి, పేటూరు, అన్నెమ్మగారిపల్లి, ఆవులపల్లి, 81 చిన్న ఉప్పరపల్లి తదితర పంచాయతీల పరిధిలో వాగులు వంకలు పొంగి పొరలుతున్నాయి. రెడ్డివారిపల్లి, చిన్నకంపల్లి, పెద్ద ఉప్పరపల్లి నుండి చౌడేపల్లి మార్గంలో వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కల్వర్టులు కొట్టుకుపోయి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. చిన్నకంపల్లి వద్ద కల్వర్టు కొట్టుకుపోవడంతో ముందు జాగ్రత్త చర్యగా దారికి అడ్డంగా గ్రామస్తులు కంపలు వేసి రాకపోకలు నిలిపివేశారు. 81 చిన్న ఉప్పరపల్లిలో భారీ వర్షం కురవడంతో చిన్నచిన్న కుంటలు చెరువులు నిండిపోయి మొరవలు పోతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షం మళ్లీ రాత్రికి కురిస్తే మరింత ఉధృతంగా వంకలు ప్రవహించి చెరువులు నిండి రాకపోకలు మరిన్ని ప్రాంతాలకు నిలిచిపోయే అవకాశం ఉందని ఈ ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. వీఆర్వోలు, వీఆర్ఏలు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూ ప్రజలకు జాగ్రత్తలు తెలియజేస్తున్నారు.

- పెద్ద ఉప్పరపల్లి వద్ద ప్రవహిస్తున్న వంక - 81 చిన్న ఉప్పరపల్లి వద్ద చెరువు నిండి మరవ పోతున్న దృశ్యం

నిండు కుండలా నాయన చెరువు

చౌడేపల్లి: మండలంలోని శెట్టిపేట పంచాయతీ మేకల చిన్నేపల్లి వద్ద గల నాయన చెరువు నిండుకుండలా కళకళలాడుతోంది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి చెరువు నిండి మొరవ దశకు వచ్చింది. గ్రామానికి సమీపంలోనే చెరువు ఉండటంతో రానున్న రోజుల్లో మరింతగా భారీ వర్షాలు కురిస్తే చెరువు కట్ట తెగే ప్రమాదముందని శివారు ప్రాంత ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. చుట్టూ కొండలు అడవి ప్రాంతం కావడంతో కొద్దిపాటి వర్షానికే చెరువు నిండి మొరవ దశకు వచ్చిందని, సామర్థ్యానికి మించి నిండితే ప్రమాదమే అని గ్రామస్తులు అంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేయాలని కోరుతున్నారు.

గాలివానకు నేలకూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

బైరెడ్డిపల్లి: మండలంలోని గౌనితిమ్మేపల్లి గ్రామంలో గురువారం రాత్రి గాలివానకు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ నేల కూలింది. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. శుక్రవారం కూడా విద్యుత్ పునరుద్ధర కాకపోవడంతో గ్రామస్తులు వర్షాలు విస్తారంగా పడుతున్నడు విద్యుత్ అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గురువారం రాత్రి నుంచి కరెంట్ లేక ఇబ్బందులు పడుతున్నామని, అటవీ సమీప గ్రామాల్లో తరచూ విష కీటకాలు, పాముల వలన ఇబ్బందిగా ఉంటుంది. కరెంట్ లేక మరింత అవస్థలతోపాట ఎక్కడ ఏ పాము, పురుగు ఉంటుందోనని భయాందోళనలో ఉన్నామని వెంటనే విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేయించి కరెంట్ సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. విద్యుత్ శాఖ ఏఈ మాట్లాడుతూ శుక్రవారం అధిక వర్షం కారణంగా విద్యుత్ స్తంభం అమర్చేందుకు ట్రాక్టర్ రాకపోవడంతో ఆలస్యమైందని, శుక్రవారం రాత్రి విద్యుత్ అంతరాయం కలుగుతుందని గ్రామస్తులు కాస్త సద్దుకోవాలని, శనివారం ఉదయాన్నే మరమ్మతులు నిర్వహిస్తామని తెలియజేశారు.

గాలివానకు నేలకూలిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్

పౌరసత్వ చట్ట సవరణను వ్యతిరేకించండి

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం బీహార్‌లో అడ్డదారులలో గెలవాలని కేంద్ర ఎన్నికల సంఘంపై ఒత్తిడి తీసుకువచ్చి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడాని దేశంలోని ప్రతి పౌరుడు వ్యతిరేకించాలని శుక్రవారం చిత్తూరులో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మతోన్మాద బీజేపీ ప్రభుత్వం ఎన్నికల పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్రప్రమాదం కలిగించే ఎస్ఐఆర్‌ను తీసుకొస్తున్నదని తెలిపారు. పౌరులు ఓటు హక్కును ప్రశ్నించే నిబంధనలు ఇందులో ఉన్నాయని, స్వతంత్రంగా వ్యవహరించాల్సిన రాజ్యాంగ వ్యవస్థ ఎన్నికల సంఘంకు విరుద్ధంగా హోం మంత్రి ఆదేశాలతో ఓటర్ లిస్టులను మార్చేసి బీహార్‌లో లక్షలాది మందికి ఓటు హక్కు తొలగించడం దారుణమని అన్నారు. బీహార్ రాష్ట్రంలో బిజెపి రాజకీయం పథకమని విమర్శించారు. బీహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పరిశీలన చేయనన్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు ఇచ్చిందని, ఇదే పద్ధతిని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని బిజెపి మతోన్మాదాన్ని విస్తరించడానికి చేస్తున్న పెద్ద ప్రయత్నమని అన్నారు. గత కొన్ని సంవత్సరాల క్రితం దేశవ్యాప్తంగా ప్రజలు తిరస్కరించిన పౌరసత్వ చట్ట సవరణలు సీఏఏ, జాతీయ పౌరసత్వ రిజిస్టర్ ఎన్‌సిఆర్ చట్టాలను ఎస్ఐఆర్ పేరుతో దొడ్డిదారిన అమలు చేయడానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం సిద్ధమైందని, అందుకే కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆయుధంగా చేసుకుందని విమర్శించారు. బిజెపి మతతత్వ అజెండాలో భాగంగా అమలు చేస్తున్న ఎస్ఐఆర్‌ను ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మత ప్రాతిపదికన పౌరులను విభజించే కుట్ర బిజెపి చేస్తున్నదని ప్రజలు ఐక్యంగా ప్రతిఘటించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జ్యోతిరావు, తదితరులు పాల్గొన్నారు.

పౌరసత్వ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

అలుపెరుగని అక్షర సేనాని డాక్టర్ కె.శ్రీనివాస్

ప్రజాశక్తి- పలమనేరు: పత్రికా సంపాదకులుగా, సాహిత్య, సామాజిక విశ్లేషకుడిగా కె.శ్రీనివాస్ సాహిత్య ప్రస్థానం ఎందరికో స్ఫూర్తిదాయకమని ప్రముఖ సాహితీవేత్త ఆర్ఎం.ఉమా మహేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం పలమనేరు లయన్స్ క్లబ్ సమావేశ మందిరంలో కెఎన్.జయమ్మ స్ఫూర్తి ప్రదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ శ్రీనివాస్ నిజాన్ని నిర్భీతిగా అక్షరీకరించిన పాత్రికేయ శిఖరమని కొనియాడారు. ఆధిపత్య భావజాలాన్ని, దోపిడీ విధానాల్ని, సామాజిక అసమానతల్ని తన రచనల ద్వారా శ్రీనివాస్ ఎండగట్టారని పేర్కొన్నారు. ఆయనొక శాంతియుత ధిక్కార స్వరమన్నారు. పురస్కార గ్రహీత కె.శ్రీనివాస్ మాట్లాడుతూ అమ్మకు మించిన సామాజిక సంస్కర్త ఎవరూ లేరన్నారు. జయమ్మ కుమారునిగా పలమనేరు బాలాజీ, ఏకలవ్య కాలనీ ఎరుకల కథల్లో తన తల్లి ఔన్నత్యాన్ని అక్షరీకరించి, ఆమెను చిరంజీవిగా నిలిపారన్నారు. తెలుగు రాష్ట్రాలు భౌగోళికంగా విడిపోయినా, సాహిత్య సాంస్కృతి అవిభాజ్యమన్నారు. పలమనేరు లాంటి మారుమూల పట్టణంలో సాహితీ సంస్థల క్రియాశీలత అన్ని ప్రాంతాల వారికి ప్రేరణ కలిగిస్తుందని అన్నారు. పలమనేరును ఇంటిపేరుగా నిలుపుకున్న బాలాజీ మూడున్నర దశాబ్దాలుగా చేస్తున్న సాహితీ సేవ ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు కె.శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. అలాగే పలమనేరు బాలాజీ రూ.25వేల నగదు పురస్కారాన్ని, యాక్ట్ సంస్థ తరఫున దశరథ రెడ్డి రూ.25వేల నగదు పురస్కారాన్ని అందించారు. ప్రముఖ సాహితీవేత్తలు జి.వెంకట కృష్ణ, సుంకోజి దేవేంద్రాచారి, రాఘవ శర్మ, సహదేవ నాయుడు, పేరూరు బాలసుబ్రమణ్యం, నెమిలేటి కిట్టన్న, బాబ్జీ, కొత్తపల్లి సురేష్, టిఎస్ఏ కృష్ణమూర్తి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు పాల్గొని ప్రసంగించారు.

విజయం డిగ్రీ కళాశాల ఎన్ఏఎస్‌సి పొడిగింపు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్థానిక మిట్టూరులోని విజయం సైన్స్ అండ్ డిగ్రీ కళాశాల యూజీసీ నుండి స్వయం ప్రతిపత్తి సాధించడం ద్వారా బెంగళూరు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ అక్రిటేషన్ చెల్లుబాటు వ్యవధి 2030 డిసెంబర్ 31వ తేదీ వరకు అధికారికంగా పొడిగించారు. విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి మాట్లాడుతూ తమ విద్యాసంస్థల నైపుణ్యం సమగ్ర విద్యార్థుల అభివృద్ధికి స్థిరమైన నిబద్ధతను ప్రతిబింబొస్తోందని అన్నారు. ఎన్ఏఎస్‌సి గుర్తింపు కోసం సమిష్టి కృషి చేసిన అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే సంవత్సరాల్లో తమ కళాశాల ప్రమాణాలను నిలబెట్టుకోవడానికి మెరుగుపరచుకోవడానికి తోడ్పడుతుందని తెలిపారు.

సాయంత్రమూ విఐపి బ్రేక్..?

'శ్రీవాణి' దర్శనం..ఏరోజుకారోజే.. / ట్రస్టు డిపాజిట్లు రూ.1000 కోట్లు పైమాటే..

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. విఐపిల తాకిడి పెరగడంతో వారిని బుజ్జగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దర్శన వేళల్లోనూ మార్పులు చేపట్టాలని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించినట్లు సమాచారం. ఈ మేరకు సాయంత్రం వేళల్లోనూ విఐపి బ్రేక్ దర్శనాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధం చేస్తోంది. తొలితగా 'శ్రీవాణి' ట్రస్టు టికెట్ పొందిన భక్తులకు ఈనెల ఒకటో తేదీ నుంచి ఏరోజుకారోజే శ్రీవారి దర్శనం చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అయితే సాయంత్రం 5.30 గంటల నుంచి 7 గంటల వరకూ ఒక విడత, రాత్రి ఏడు గంటలకు శ్రీవారికి నైవేద్యం తరువాత మరో విడత 'శ్రీవాణి' ట్రస్టు భక్తులకు అవకాశం కల్పిస్తున్నారు. ఇది సక్సెస్ కావడంతో సిఫార్సు లేఖల ద్వారా వచ్చే వారికి ఉదయం పూటే కాకుండా సాయంత్రం వేళల్లోనూ వారికి అవకాశం కల్పించే యోచన చేస్తున్నారు.

శ్రీవాణి ట్రస్టు డిపాజిట్లు రూ.1000 కోట్లు

శ్రీవాణి ట్రస్టు స్థాపించి ఐదేళ్లు కావస్తోంది. దీని ముఖ్య ఉద్దేశ్యం విఐపి బ్రేక్ కావాలన్న సామాన్య భక్తులు ఎవరైనా రూ.10వేలు శ్రీవారికి డొనేషన్, రూ.500 విఐపి బ్రేక్ టికెట్ పొంది టికెట్ తీసుకున్న మరుసటిరోజు ఉదయం విఐపి బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకోవచ్చు. ఇది ఆనవాయితీ. దీనిద్వారా ఇప్పటివరకూ వెయ్యి కోట్లు ఆదాయం శ్రీవాణి ట్రస్టు ద్వారా వచ్చినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ ఆదాయాన్ని హిందూ సనాతన ధర్మం ప్రచారం కోసం, దళిత గిరిజన, పల్లె ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాలు, రామాలయాలు, శ్రీకృష్ణ మందిరాలు, ఇతర హిందూ దేవాలయాలు నిర్మించేందుకు వినియోగించాలన్నది ముఖ్య ఉద్దేశ్యం. గత వైసిపి హయాంలో అప్పటి పాలకమండలి అధ్యక్షులు వైవి సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డిలు 137 కోట్లు ఆలయాలు నిర్మించేందుకు శ్రీవాణి నిధులను కేటాయించారు. కూటమి హయాంలోనూ ప్రస్తుత పాలకమండలి ఛైర్మన్ బిఆర్ నాయుడు 17 కోట్లు నిధులు మంజూరు చేశారు. 137 కోట్లు రాష్ట్రవ్యాప్తంగా ఆలయాలకు ఖర్చు చేశారు. అయితే ఆయా ప్రాంతాల్లోని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవోల యుటిలిటి సర్టిఫికెట్లు ఇవ్వాల్సి ఉంది. ఈ మేరకు గత ప్రభుత్వం ఖర్చు చేసిన 137 కోట్లకు సంబంధించిన లెక్కలను దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి టిటిడిని కోరినట్లు సమాచారం. ఈ మేరకు రూ.137 కోట్లకు సంబంధించిన నిధుల ఖర్చులను తెప్పించే పనిలో టిటిడి అధికారులు నిమగ్నమై ఉన్నారు. అలాగే చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో 10 ఆలయాలు, పలమనేరు, జీడినెల్లూరు నియోజకవర్గాల్లో మరో 10 ఆలయాలకు జూన్ నెలలో జరిగిన బోర్డులో రూ.17 కోట్లు కేటాయించి వెచ్చించనున్నారు. శ్రీవాణి ట్రస్టు ఆదాయం రోజురోజుకూ పెరుగుతుండడంతో టికెట్లను ప్రస్తుతం ఆన్‌లైన్‌లో రోజుకు 500, తిరుమల, తిరుపతి ఎయిర్‌పోర్టు ఆఫ్‌లైన్‌లో 1000 టికెట్లను మంజూరు చేస్తుండటం గమనార్హం. సాయంత్రం విఐపి బ్రేక్ సక్సెస్ అయితే తిరుమలలో మరో 500 టికెట్లను ఇచ్చేందుకు అధికారులు నిర్ణయించారు. నవంబర్ 1 వరకూ ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న భక్తులకు మాత్రం ఉదయం విఐపి దర్శనం మాత్రమే అవకాశం ఉంటుంది. ఆపైన బుక్ చేసుకునే శ్రీవాణి ట్రస్టు భక్తులకు ఉదయం, సాయంత్రం వేళల్లో శ్రీవారిని దర్శించుకునే అవకాశాన్ని టిటిడి కల్పించనుంది.

సాకారం కాని 'పోలీస్ అవుట్ పోస్ట్'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి భద్రత దష్ట్యా పోలీస్ అవుట్ పోస్ట్ అవసరం అక్కడ ఉంది. గతంలో జరిగిన కొన్ని సంఘటనల నేపథ్యంలో ఆసుపత్రి యాజమాన్యం నుంచి ఈ డిమాండ్ మరింత పెరిగింది. ఈ క్రమంలోనే ఇటీవల ఏరియా ఆసుపత్రి సందర్శనకు వచ్చిన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తక్షణమే ఏరియా ఆసుపత్రి వద్ద పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేయాల్సిందిగా శ్రీకాళహస్తి డిఎస్పిని ఆదేశించారు. అయితే పక్షం రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఆచరణ సాధ్యం కాలేదు. సిబ్బంది కొరత కారణంగానే పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేయలేకున్నామని పోలీసు అధికారులు చెబుతున్న మాట. అయితే ఏరియా ఆసుపత్రికి వెళ్లే దారితో పాటు, పరిసర ప్రాంతాల్లో కొందరు ఆకతాయిలు నిత్యం గంజాయి, మద్యాన్ని తాగి గొడవలు పడుతున్నారు. అటుగా వెళ్లే కాలేజీ, స్కూల్ విద్యార్థినులతో పాటు రోగుల బంధువులపై ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్నారు. దీంతో ఆసుపత్రి యాజమాన్యం మరింత కంగారుపడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇకనైనా పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

గస్తీ ఏర్పాటు చేయండి: కాంగ్రెస్

శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి వెళ్లే దారిలో పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం తలపా దామోదర్ రెడ్డి శుక్రవారం శ్రీకాళహస్తి డిఎస్పీ నరసింహమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ దారిలో కాలేజీలు, స్కూళ్లు, ప్రభుత్వ ఆసుపత్రి ఉన్నాయన్నారు. మద్యం మత్తులోని కొందరు యువకులు ఈ దారిలో వెళ్లే విద్యార్థినులు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని దామోదర్ రెడ్డి వాపోయారు. ఏరియా ఆసుపత్రి వద్ద పోలీసు అవుట్ పోస్టును ఏర్పాటు చేస్తే ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్టు వేయచ్చని సూచించారు.

ఆటోమ్యుటేషన్..అంతంతమాత్రమే..!

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆస్తి యాజమాన్య హక్కు బదలాయింపు (మ్యుటేషన్) విధానం అమలులో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నెల 1 నుంచి 17 నగరపాలక సంస్థల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆటోమ్యుటేషన్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే సబ్ రిజిస్ట్రార్, మున్సిపల్ కార్పొరేషన్ల వద్ద ఉన్న వివరాల్లో డోర్, వార్డు, బ్లాక్ నంబర్ల పరంగా చాలాచోట్ల అనుసంధానం కాలేదు. ఆటోమ్యుటేషన్కు ఇది ప్రధాన అవరోధంగా మారింది. ఫలితంగా మొత్తం రిజిస్ట్రేషన్లలో 20–30 శాతం లావాదేవీలకు మాత్రమే పేర్లు మారుతున్నాయి. మిగి లిన డాక్యుమెంట్లలో పేర్లు మారడం లేదు. ఎసెస్ మెంట్ నంబరు కలిగి, రిజిస్ట్రేషన్ (సేల్, గిఫ్ట్, పార్టిషన్) జరిగిన ఇళ్లు, కొత్త ప్లాట్లకు ఆస్తి పన్ను చెల్లింపు రశీదులో కొనుగోలు చేసిన వ్యక్తి పేరు వచ్చేలా ప్రభుత్వం మార్పులు చేపట్టింది.

ఇంటి నంబర్లలో ఏకత్వం లేని ఫలితం..

రిజిస్ట్రేషన్ల శాఖ ఆటోమేటిక్ మ్యుటేషన్ విధానాన్ని ఆగస్టు నెలలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టింది. అమలు తీరును పరిశీలించాక ఆగస్టు 1 నుంచి 17 నగరాలకు విస్తరించింది. ఈ కొత్త విధానంలో సదరు ఆస్తికి సంబంధించిన అన్ని బకాయిలు చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. డోర్ నంబర్లకు అనుగుణంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సిబ్బంది మార్కెట్ విలువను ఖరారు చేస్తు న్నారు. మున్సిపల్ కార్పొరేషన్ల వద్ద కూడా వివరాలు ఇంతే కచ్చితంగా ఉంటాయని భావించారు. అయితే, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు డోర్ నంబర్ల కేటా యింపులో అనుసరించిన విధానం ఒక్కోచోట ఒక్కో రకంగా ఉంది. వార్డు, బ్లాక్, డోర్ నంబరు కలిపి ఒక నంబరు కింద ఇస్తున్నారు. అంకెల మధ్య ఫుల్స్టాఫ్, నిలువుగీత లేదా అడ్డగీతలు వంటివి ఉన్నాయి. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రెవెన్యూ వార్డు, వార్డు నెంబరు, ఇంటి నెంబరు వేరువేరుగా ఉండడం వల్ల మ్యుటేషన్ కొంత ఇబ్బందులు అయితే తిరుపతిలో ఉన్నాయి. మ్యుటేషన్ ఎక్కువగా జరగడం లేదు. రోజుకు 10 నుంచి 15 జరుగుతున్నాయి. మ్యుటేషన్ ఈ నంబర్ల నమోదులోనూ ఒకే కార్పొరేషన్ పరిధిలో రకర కాల పద్ధతులు అవలంబించారు. రాష్ట్రంలో కొన్ని కార్పొరేషన్‌లలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నా. సాంకేతిక సమస్య లతో ఆటో మ్యుటేషన్ కావడం కావడం లేదు. కొత్త యజమాని పేరు రికార్డుల్లోకి చేరడంలేదు. ఫలితంగా వీరు పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యాక సబ్ రిజి స్ట్రార్ కార్యాలయాల్లో ఇచ్చే డాక్యుమెంట్లతో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శిస్తున్నారు

సాంకేతిక సమస్యలతో మారని పేర్లు
అనుసంధానం20-30శాతమే...

పురపాలక లాగిన్‌కు సమాచారం

రిజిస్ట్రేషన్ సమయంలో ఆస్తికి సంబంధించిన ఇంటి, నీటి పన్నుల బిల్లులు పొందుపర చాలి. లేకుంటే రిజిస్ట్రేషన్కు స్లాట్ బుకింగ్ పొందే అవకాశం ఉండదు. ఖాళీ స్థలం అయినా పన్ను రసీదు తప్పనిసరి. పన్ను బకాయిలు చెల్లిస్తేనే ఈ పద్ధతిలో రిజిస్ట్రేషన్ సాధ్యమవుతుంది. అన్నీ పక్కాగా జరిగాక కొనుగోలుదారుల పేరుతో పన్ను మార్చాలని రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి మున్సిపల్ లాగిను సమాచారం వెళ్తుంది. అక్కడ ఆన్లై న్ లో ఆమోదం తెలపగానే ఆటో మ్యుటేషన్ ధ్రువపత్రంతోపాటు ఆస్తి పత్రాలు తీసుకో వచ్చు. మార్కెట్ విలువ, విస్తీర్ణం మేరకు మ్యుటేషన్ ఛార్జీలు నిర్ణయిస్తారు

సమస్యను అధిగమిస్తాం

శివకుమార్, జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారి

మ్యుటేషన్ కి సంబంధించిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లాం. సమస్యను అధికమించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. సాంకేతిక ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

పట్టు పురుగుల పెంపకం.. రైతుకు లాభాల సిరి..

- అందని ప్రభుత్వ చేయూత
- ఇతర పంటల సాగుతో నష్టం
- ఆదాయం వస్తుందన్న ఆశతో రైతుల నిరీక్షణ

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): జిల్లాలో పడమటి మండలాలు గంగవరం, పలమనేరు రూరల్, పెద్దపంజాణి మండలాలు పట్టుపురుగుల పెంపకంలో ప్రసిద్ధి చెందాయి. ఇటీవల కాలంలో మిగిలిన పంటలు సాగు చేస్తున్నా గిట్టుబాటు ధర లేక ఆశించిన లాభాలు రాకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ఈ తరుణంలో పట్టుపురుగుల పెంపకం లాభదాయకంగా వుండడంతో రైతులు దీనిపై దృష్టి సారించారు. అయితే గతంలో సబ్సిడీల రూపంలో తమకు ప్రభుత్వం సాయం చేసేదని, ప్రస్తుతం అది లేకపోవడంతో ప్రభుత్వ చేయూత కరువైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో పట్టు గూళ్లకు గిట్టుబాటు ధర లభిస్తోందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తూ వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

పట్టు పురుగుల పెంపకం..రైతుకు లాభాల పంట..

జిల్లాలో పడమటి మండలాలు గంగవరం, పలమనేరు రూరల్ , పెద్దపంజాణి మండలాలు రాష్ట్రంలో పట్టుపురుగుల పెంపకంలో ప్రత్యేక స్థానం పొందాయి. దశాబ్దాల కాలంగా చాలా మంది రైతులు పట్టుపురుగులు పెంపకంతో జీవనం సాగిస్తున్నారు. దీంతో పాటు కర్ణాటక సరిహద్దు కావడంతో సమీపంలోని కర్ణాటక శ్రీనివాసపురం, చింతామణి, కోలారు ప్రాంతాలలో పట్టుగూళ్ల మార్కెట్లో ధర ఎక్కువగా ఉండటంతో ఈ ప్రాంతాల వారు ఆ మార్కెట్లకు వెళ్లి గూళ్లు అమ్ముకునేవారు. విత్తనాలకు నిలయంగా పలమనేరు మార్కెట్ దశాబ్దాల కాలంగా పేరెన్నిక కావడంతో ఎక్కువ మంది రైతులు విత్తన గూళ్లు పెంచి ఈ మార్కెట్ కు తరలించి అమ్ముకుంటున్నారు. గతంలో పట్టుగూళ్ల రేట్లు పూర్తిగా పతనం కావడంతో కొన్ని రోజులు పాటు ఆ పంటకు

అమ్మకానికి సిద్ధంగా ఉన్న పట్టుగూళ్లు

దూరమయ్యారు. మళ్లీ ధరలు ప్రస్తుతం బాగా ఉండటంతో మళ్లీ అదే మార్గాన్ని ఎంచుకున్నారు.

అందని ప్రభుత్వం చేయూత

విత్తనాల గూళ్లకు మార్కెట్ ధరపై 50 రూపాయలు రైతుల ఖాతాల్లో గతంలో వేసేవారని ప్రస్తుతం అది నిలిపివేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఒక పర్యాయం 500 గుడ్లు పెంచుతామని ప్రస్తుతం పట్టు గూళ్ల ధరలు ఎనిమిది వందల దాకా ఉండడంతో పంటకు రెండున్నర లక్షల నుండి మూడు లక్షల రూపాయలు వరకు బిల్లులు అందుతున్నాయని ఇలాంటి పరిస్థితులలో వేరే పంటలపై ఆధారపడడం ఎందుకని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ పట్టు పురుగుల పెంపకాన్ని నెల దాకా తమ కుటుంబంలా చూసుకున్నట్లు చూసుకుంటూ పది రోజులు మాత్రమే కూలీలను ఆశ్రయిస్తామని దీంతో తమకు ఆదాయం బాగా వస్తోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వం సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తే పట్టుపురుగుల గూళ్ల సాగు చేస్తామని రైతులు పేర్కొంటున్నారు.

చాలా కాలంగా ఇదే ఆధారం

మా పెద్దల కాలం నుండి పట్టుపురుగుల పెంపకంతోని ప్రారంభమైంది. దశాబ్దాల క్రితం ఎదురుదెబ్బలతో అల్లిన తట్టలులో పురుగులు పెంచి ఎదురు దబ్బలతో అల్లిన చంద్రంకలులో పట్టు గూళ్లు కట్టడానికి ఏర్పాట్లు చేసేవారం. ప్రస్తుతం అనేక రకాల టెక్నాలజీలతో పంటలు మేపడానికి సులభతరమైంది. గత ప్రభుత్వాలు పట్టు రైతులకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి పురుగులు పెంపకానికి షెడ్లు, పురుగులు ఉంచడానికి బెడ్ల నిర్మాణానికి సబ్సిడీ రూపంగా డబ్బులు ఇచ్చేవారు. పురుగులు గూళ్లు కట్టడానికి బదనికల్ కూడా ఇచ్చారు. గతంలో ప్రభుత్వం తరపున విత్తనాల గూళ్లకు మార్కెట్ ధరపై 50 రూపాయలు రైతుల ఖాతాల్లో వేసేవారు. ప్రస్తుతం అది నిలిపివేశారు.. ఈ పట్టుపురుగుల పెంపకంతోనే మా కుటుంబంతో పాటు పిల్లలను చదివించి వారికి ఉద్యోగాలు కూడా తెచ్చుకున్నాం.. ఇప్పుడు కూడా తమ పట్టుపురుగుల పెంపకం తోని జీవనం సాగిస్తున్నాం.. నాకు అనేకసార్లు ప్రభుత్వమేటి రైతుగా అవార్డులు అందించిందని ఎంతోమంది రైతులకు సూచనలు, సలహాలు ఇస్తూ ఉంటానని తెలిపారు. విత్తన గుళ్లు మార్కెట్ పలమనేరులో ఉండడంతో ఎక్కువ వాటిని పెంచి మార్కెట్ కి తరలిస్తామని ,తాము ఒక పర్యాయం 500 గుడ్లు పెంచుతాం.. ప్రస్తుతం గూళ్ల ధరలు ఎనిమిది వందల దాకా ఉండడంతో పంటకు రెండున్నర లక్షల నుండి మూడు లక్షల వరకు బిల్లులు అందుతున్నాయి.. ఇలాంటి పరిస్థితులలో వేరే పంటలపై ఎందుకు ఆధారపడాలి?' ఈ పట్టు పురుగుల పెంపకాన్ని నెల దాకా తమ కుటుంబాలు చూసుకుంటాం..

- సుబ్బారెడ్డి, పట్టురైతు, తాళ్లపల్లి, గంగవరం మండలం.

ఆదాయం బాగా వస్తోంది..

పది రోజులు మాత్రమే కూలీలను ఆశ్రయిస్తాం.. దీంతో మాకు ఆదాయం బాగా వస్తోంది. చిన్న నాటి నుండి ఈ పట్టుపురు గుల పెంపకం పైనే ఆధారపడ్డాం.. ఇతర వ్యవసాయాల్లో గిట్టుబాటు ధర లేమి, కూలీలు సమస్య, పెట్టుబడుల సమస్యలు ఉండడంతో ఆనాటి నుండి ఈ పట్టుగుళ్లపై ఆధార పడ్డాం.. ఇందులోనే పిల్లల చదువులు, సంసారం అన్ని సజావుగా సాగుతున్నాయి. గతంలో ప్రభుత్వం రైతులకు షెడ్డు నిర్మించి వాటికి కావలసిన పరికరా లు కూడా ప్రభుత్వం సబ్సిడీలు అందించేది. మొక్కలు నాటు కోవడానికి ఎకరాకు ఇంత అని ప్రభుత్వం సబ్సిడీ చెల్లిస్తూ వుండేది. పసుపు రకం గూళ్ళు పెంచుకొని కర్ణాటక చింతామణి కోలారు ప్రాంతాలకు వెళ్లి అమ్ము కుంటున్నాం.. ప్రస్తుతం గూళ్ల రేటు ఆశాజనకంగా వుంది. 650 రూపాయలు నుండి 800 దాకా ధర ఉందని పంటకు రెండు లక్షల రూపాయలు చొప్పున సంపాదన ఉందని ఈ పంట పూర్తి కావడానికి కేవలం 40 రోజులు మాత్రమే పడుతుందని అందులో కేవలం పది రోజులు ఎక్కువగా పని ఉంటుం దని దీంతో పటు పురుగులు తిని వదిలిన ఆకు పశువులకు సైతం మంచి పోషక పదార్థం కావడంతో అటు పశువులను కూడా పెంచుకోవడానికి సులభంగా ఉంటుంది..

- సుబ్రమణ్యం, పట్టురైతు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -విజయపురం (నగరి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన నగరి మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. విజయపురం గొల్ల కండ్రిగకు చెందిన శామ్యూల్, ఆర్ హరీష్‌లు నగరికి ద్విచక్రవాహనంపై వేలావడి వైపు వెళుతున్న సమయంలో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని స్థానికులు నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. హరీష్ కాలి ఎముక విరిగి తీవ్రగాయం కాగా, శామ్యూల్ తలకు గాయమైంది. క్షతగాత్రులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

రూ.16,000 నగదు స్వాధీనం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి : పేకాట రాయుళ్లు ఆరుగురిని అరెస్టుచేసి వారి వద్ద నుండి 16,000 స్వాధీనం నలుగురు పరారీ అయ్యారని ఎస్ఐ పరశురాముడు తెలిపారు. మండలంలోని బేలుపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న పట్టినపల్లి గ్రామం సమీపంలోని వెటర్నరీ హాస్పిటల్ పక్కన ఉన్న చెట్టు కింద పేకాట ఆడుతున్నారని సమాచారం అందడంతో స్థానిక ఎస్సై వారి సిబ్బంది కలిసి హుటాహుటిన సంఘటన చేరుకొని విచారించగా సీఎం నవీన్ కుమార్, ఆర్ చలపతి, గంగినాయనపల్లికి చెందిన అనిల్ బెల్లమడుగు, ,టీ నాగరాజ్ గౌతమాకులపల్లి పంజాని మండలం, ఏం రెడ్డప్ప బెల్లం మడుగు, ఎం రెడ్డప్ప గుండుగల్ .పేకాటరాయలను పట్టుకున్నారు. నలుగురు పరారయ్యారు వీరి వద్ద 16 వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నామని పరాయన వ్యక్తులు బేలుపల్లి గ్రామానికి చెందిన అశోక్, వెంకటరమణ, చందు, దేవను కూడా త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు. అంతేకాకుండా మండలంలో పేకాటరాయుళ్ల గుండెల్లో పరుగులు పెట్టిస్తామని పేకాట జూదం ఆడితే సహించేది లేదని చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ పరశురాముడు తెలిపారు.

గుండె పోటుతో అటెండర్ మృతి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సబ్‌ఆర్డినేటర్(అటెండర్)గా పని చేస్తున్న మగ్గం నవీన్ కుమార్ (31) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. మదనపల్లికి చెందిన నవీన్ కుమార్ తండ్రి ఇటీవల మృతి చెందాడు. ప్రస్తుత ఉద్యోగంలో చేరి విధులు నిర్వహిస్తుండగా రెండు నెలల క్రితం గంగాధర నెల్లూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సబార్డినేట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా శుక్రవారం నవీన్ కుమార్ గుండెపోటుతో మృతి చెందాడు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని అధికారులు నివాళులర్పించారు.

డి ఫార్మసీ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కాలేజీకి ఐఎస్ఓ సర్టిఫైడ్, ఎంబీఏ ఎన్బీఏ అక్రెడిటెడ్, పిసిఐ అప్రూవ్, ఎస్బిఐటేట్ గుర్తింపు ఉందని ప్రిన్సిపల్ డాక్టర్ పద్మావతమ్మ తెలిపారు. ఈ కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆగస్టు 9 నుండి 19 వరకు స్వీకరించబడతాయని, ఇంటర్మీడియట్‌లో ఎంపిసి, బైపిసి కోర్సులలో ఉత్తీర్ణత సాధించిన ఆసక్తి గల విద్యార్థినులు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థినులకు ఉచిత హాస్టల్ వసతి, భోజన సౌకర్యం కల్పించబడుతుందన్నారు. మరిన్ని వివరాల కోసం ఈ నెంబర్లను 9299008151, 9247575386, 8978993810 సంప్రదించాలని సూచించారు.

టీడీపీ బీమా మొత్తం అందజేత

ప్రజాశక్తి - పుత్తూరు: నగరి నియోజకవర్గం, వడమాలపేట మండలం, సీతారామాపురం గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు వి.రాజేంద్రరావు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి టీడీపీ ఇన్సూరెన్స్ సదుపాయం ద్వారా రూ.5లక్షల చెక్కును నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ మృతుని భార్య సరస్వతి, కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఒత్తిడి నుంచి విముక్తి పొందండి

ప్రజాశక్తి -కోట : కోట మండలం, ఎంఈఓ కార్యాలయం ముందున్న బీసీ బాలుర వసతి గృహంలో హాస్టల్ వార్డెన్ గజేంద్రబాబు ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు ఫ్రెషర్స్ డే జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎస్సై పవన్ కుమార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా శారీరకంగా, మానసికంగా, ఉల్లాసంగా విద్యను పెంపొందించుకోవాలని తెలిపారు. హాస్టల్లో ఉన్నప్పుడు ప్రతి విద్యార్థితో ప్రేమ, అభిమానాన్ని చాటుకుని అందరితో కలిసి మెలిసి నడుచుకోవాలన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి కష్టపడి చదువుకోవాలని పలు సూచనలు, సలహాలను అందజేశారు. నూతనంగా ఈ సంవత్సరంలో హాస్టల్లో 59 విద్యార్థులు చేరారని హాస్టల్ వార్డెన్ గజేంద్రబాబు తెలిపారు. ఎస్సై చేతుల మీదుగా విద్యార్థులకు పలు రకాల పండ్లు, కోలాటం స్టిక్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీసీ బాలుర వసతి గృహం హాస్టల్ వార్డెన్ గజేంద్రబాబు, గొట్టుప్రోలు హాస్టల్ వార్డెన్ రమణయ్య, గూడూరు హాస్టల్ వార్డెన్ సుబ్రహ్మణ్యం, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

వరసిద్ధుని దర్శించుకున్న హైకోర్టు జడ్జీలు

ప్రజాశక్తి-ఐరాల: శ్రీ స్వామి వారిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణరావు కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్నారు. వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, చిత్ర పటాన్ని ఈవో పెంచల కిషోర్ అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎస్వి కృష్ణారెడ్డి, సూపరింటెండెంటు వాసు, సిఐ శ్రీధర్ నాయుడు, కాణిపాకం ఎస్ఐ నరసింహులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, చిత్తూరు కోర్టు సిబ్బంది, ఐరాల రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుహిన్‌కుమార్ వరసిద్ధి వినాయకుడిని శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఈవో పెంచల కిషోర్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు శేషవస్త్రం, చిత్రపటం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎస్వి కృష్ణారెడ్డి, సూపరింటెండెంటు వాసు, కాణిపాకం ఎస్ఐ నరసింహులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, చిత్తూరు కోర్టు సిబ్బంది, ఐరాల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -పలమనేరు రూరల్: గంగవరం, పలమనేరు మున్సిపాల్టీ పరిధిలో టీఎస్ అగ్రహారంలో కొత్తగా 220 కెవి విద్యుత్ టవర్స్ నిర్మాణానికి ఈ నెల 9వ తేదీ నుండి 11వ తేదీ వరకు మూడు రోజులు పాటూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగ దారులు సహకరించాలని విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీవన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. పగటిపూట టిఎస్ అగ్రహారం గ్రామానికి మాత్రమే ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. టీఎస్ అగ్రహారం గ్రామం విద్యుత్ వినియోగ దారులు, ప్రజలు విద్యుత్ శాఖకు సహకరించాలని వారు కోరారు. ఈ నెల 9వ తేదీ శనివారం విద్యుత్ 220 కేవి పలమనేరు సబ్ స్టేషన్‌లోని 33 కెవి లైనులో మరమ్మతులు కారణంగా పలమనేరు అర్బన్, పలమనేరు రూరల్, గంగవరం, బైరెడ్డిపల్లి మండలాల్లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం వుంటుందన్నారు. ప్రజలు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తెలిపారు.

శ్రీదుర్గాంబ ఆలయంలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : చిత్తూరులోని గిరింపేట శ్రీ దుర్గమ్మ తల్లిని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ శుక్రవారం దర్శించుకున్నారు. దేవస్థాన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీదుర్గాంబ దేవస్థానం దసరా బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, గురజాల జీవన్, అట్లూరి శ్రీనివాసులు, ఇతర నాయకులు, దేవస్థానం కమిటీ సభ్యులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పులివెందుల ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ఉప ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పలమనేరు: పులివెందుల నియోజకవర్గంలోని ఆచిపల్లిలో జెడ్పిటిసి ఉప ఎన్నికలో భాగంగా ఉమ్మడి అభ్యర్థి తరపున నిర్వహించిన ప్రచారంలో కడప జిల్లా నేతలతో కలిసి పలమనేరు ఎమ్మెల్యే ఎన్ అమరనాథ రెడ్డి పాల్గొన్నారు. పులివెందుల టిడిపి కార్యాలయంలో మీడియా సమావేశంలో పాల్గొని జెడ్పిటిసి ఉప ఎన్నికలో తమ అభ్యర్థి తప్పకుండా గెలుస్తారని అమరనాథ రెడ్డి తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-కోట: కోట మండలం, ఎన్సిఆర్ నగర్ లో జనతా క్లినిక్ ఆసుపత్రి డాక్టర్ ఎమ్. జగదీష్ ఏర్పాటు చేసిన న్యూరాలజీ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. శుక్రవారం ఏర్పాటుచేసిన ఈ వైద్య శిబిరంలో 50 మంది రోగులు పాల్గొని పరీక్షలు చేయించుకుని, మందులను ఉచితంగా పొందారు. ఈ శిబిరానికి నెల్లూరు కిమ్స్ ఆస్పత్రి నుండి ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ వి అభినయ రెడ్డి హాజరయ్యారు. నరాలు వ్యాధి బారిన పడకుండా పలు జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనతా క్లినిక్ డాక్టర్ ఎమ్. జగదీష్ డాక్టర్ ఉమేరా, జనతా క్లినిక్ ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

పుత్తూరులో గాలివాన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :గురువారం రాత్రి కురిసిన గాలి, వానతో పుత్తూరు మున్సిపాలిటీ 15వ వార్డు రామారావు కాలనీలో సుమారు 80 సంవత్సరాల భారీ వేపచెట్టు శుక్రవారం కూలిపోయింది. చెట్టు కింద నిలిపిన మూడు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈదురు గాలికి విద్యుత్ తీగలు తెగిపోవడంతో అధికారులు వెంటనే సరఫరా నిలిపివేశారు. ఎంవీ రోడ్డులో వర్షానికి జలమయం కావడంతో, రైల్వే అండర్ బ్రిడ్జిలో భారీగా నీళ్ళు నిలిచిపోయాయి.

జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా కందుకూరి హుమేష్

ప్రజాశక్తి -వెదురుకుప్పం: చిత్తూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్)గా వెదురుకుప్పం మండల కాంగ్రెస్ అధ్యక్షులు కందుకూరు హుమేష్ ను నియమించి నట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ నియా మక పత్రాన్ని జిడి నెల్లూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ రమేష్ బాబు సమక్షంలో అందిం చారు. కార్వేటినగరం మండలం అన్నూరులో గంగాధర నెల్లూరు నియోజకవర్గ సమీక్ష సమా వేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుకూరు హుమేష్ మాట్లాడుతూ తనను జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్గనైజేషన్‌గా నియమించిన షర్మిలారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ పదవి వచ్చేందుకు సహకరించిన చిత్తూరు జిల్లా అధ్యక్షులు పోటుగారి భాస్కర్‌కి, జిడి నెల్లూరు నియోజకవర్గ కో ఆర్డినేటర్ రమేష్ బాబుకి కృతజ్ఞతలు తెలిపారు. తనకు మరింత బాధ్యత పెరిగిందని, జిల్లాలో కాంగ్రెస్ బలో పేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి రాంభూపాల్ రెడ్డి, ఏపీసిసి మాజీ కార్యదర్శి ఏపీ పరదేశి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



హుమేష్‌కు నియామకపత్రం అందిస్తున్న అందిస్తున్న దృశ్యం

వర్షానికి చెట్టు కూలిపోవడంతో దెబ్బతిన్న టమాటా పంట

వర్షాలకు భారీ వృక్షం కూలి పంట నష్టం

ప్రజాశక్తి-పెద్దపంజాణి: భారీ వర్షాలతో భారీ వృక్షం నేల కొరకడంతో టమాటా పంట కు భారీ నష్టం వాటిల్లిన సంఘటన మద్దలకుంట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. అదే గ్రామానికి చెందిన రైతు ముని రెడ్డికి చెందిన పొలం పక్కనే వంక ఉండేదని ఇటీవల ఆ వంకను మట్టితో పూడ్చి రోడ్డు వేయడంతో నీరు మొత్తం తన పంట పొలాలపై పారాయి. నీటి తాకిడికి భారీ చెట్టు తన పొలంపై పడటంతో టమోటా పంట మొత్తం నేలకొరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో టమాటాకు సరైన రేటు లేకపోవడంతో భారీగా నష్టాలను భరించామని, ఇప్పుడు టమాటాకు గిట్టుబాటు ధర రావడంతో అప్పుల నుంచి బయటపడవచ్చని ఆశించే సమయంలో ఇలా వర్షాలతో టమాట పంట నష్టంవాటిల్లిందని రైతు మునిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-పెద్దపంజాణి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం జనసురక్ష పథకాలను అవగాహన చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ సూచించారు. శుక్రవారం మండలంలోని కొళత్తూరు పంచాయతీ పరిధిలోని మద్దలకుంటలో జన సురక్ష పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన,అటల్ పెన్షన్ యోజన పథకాల వల్ల బీమా వర్తిస్తుందని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్, బ్యాంకు సిబ్బంది, బ్యాంకు మిత్ర నాగరాజ, సంఘమిత్ర జగన్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాణిపాకంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం

ప్రజాశక్తి -ఐరాల: శ్రీ స్వామివారి దేవస్థానం అనుబంధ దేవాలయం శ్రీదేవి భూదేవి సమేత వరదరాజ స్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. స్వామికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న కూటోత్సవం నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహిం చారు. ఉభయ దారులుగా శ్రీ వరదరాజు స్వామి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస ఆచార్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో పెంచల కిషోర్ , స్థానిక సర్పంచ్ శాంతి సాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ వాసు పాల్గొన్నారు.

చౌడేపల్లి: పట్టణంలోని హరి మందిరంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతం నిర్వహిం చారు. మృత్యుంజయేశ్వర ఆలయం, పార్వతీదేవి ఆలయం చౌడేశ్వరి ఆలయాల్లో వరలక్ష్మీదేవి వ్రతం నిర్వహించారు.

విజయపురం (నగరి): మాజీ మంత్రి ఆర్కేరోజా పట్టణ పరిధిలోని తన నివాసం వద్ద శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గోవుకు పసుపు, కుంకుమలు పెట్టి గోపూజ చేశారు. అనంతరం వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు.

ఎస్ఆర్ పురం : మహిళలు వరలక్ష్మి వ్రతాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆరి మాను గంగమ్మ ఆలయంలో అర్చకులు వెంకటాచలపతి అమ్మవారి రూపాన్ని తీర్చిదిద్ది వేద మంత్రం పట్టణం మధ్య ఘనంగా నిర్వహించారు. గ్రామాల ప్రజలు అమ్మవారి పూజలో పాల్గొన్నారు. గ్రామ పౌరోహితులు కార్తికేయన్ పాల్గొన్నారు.

సోమల: మండలంలోని ఆవులపల్లి గ్రామంలో అతి పురాతన దేవాలయమైన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో, టిటిడి ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ట్రాలీలు లేక.. ట్రాక్టర్లు వాడక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పంచాయతీకి మండల అభివృద్ధి కార్యాలయం నిధులు మంజూరు చేయకపోవడంతో పారిశుద్ధ్య పనులు ఆగిపోయాయి. ప్రత్యామ్నాయం మార్గంగా పంచాయతీ మూడు చక్ర వాహనాలతో చెత్తను తరలిస్తూ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ పథకం కింద పుత్తూరు మండలంలోని మేజర్ పంచాయతీలు తడుకు, కేబీఆర్ పురం గ్రామాలకు రెండు ట్రాక్టర్ల కొనుగోలుకు రూ13 లక్షల నిధులు మంజూరు చేసి ట్రాక్టర్ ఇంజన్లు ఇచ్చారు. కానీ వాటికి ట్రక్కులు ఇవ్వకపోవడంతో గత సంవత్సర కాలంగా వాటిని మూలన పడేశారు. మూడు చక్రాల వాహనాలతో

చెత్త తరలింపు ఆలస్యమై, గ్రామాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని స్థానికులు తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఇచ్చిన ట్రాక్టర్లకు ట్రక్కులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

మా పంచాయతీలో 16 గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో మొత్తం చెత్త తొలగించాలంటే మూడు చక్రాల తోపుడు వాహనాలతో చాలా సాధ్యంకాదు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఇచ్చిన ట్రాక్టర్ ఇంజన్లకు ట్రాలీలు మంజూరు చేయాలి.

- వై.నందయ్య, తడుకు ఎగువ గూళూరు

గతంలో పారిశుద్ధ్య నిర్వహణకు ఇచ్చిన ట్రాక్టర్లకు, ట్రాలీలు లేని విషయం వాస్తవమే. ట్రక్కుల కొనుగోలుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావాల్సి ఉంది. మంజూ రైన వెంటనే ట్రాలీలు కొనుగోలు చేస్తాం.

- వాణి, మండల ఇన్చార్జి అభివృద్ధి అధికారిణి

బియ్యం కోసం తప్పని కష్టాలు

రెండు కిలో మీటర్ల దూరం పైనే ప్రయాణం

ప్రజాశక్తి - రొంపిచర్ల: ప్రభుత్వం పేదలకు ఇస్తున్న రేషన్ బియ్యం తీసుకునేందుకు లబ్ధిదారులు తీవ్ర కష్టాలు పడుతున్నారు. రొంపిచర్ల మండలంలోని మోటు మల్లెల గ్రామపంచాయతీ ఏటుకూరు వారి పల్లెకు చెందిన లబ్ధిదారులు సబ్సిడీ బియ్యం కోసం రెండు కిలోమీటర్ల దూరంలోని గంగిరెడ్డిపల్లికు పరుగులు తీస్తున్నారు. చౌక దుకాణానికి బియ్యం కోసం వెళితే మళ్లీ ఎప్పుడు ఇంటికి వస్తామో చెప్పలేమని వాపోతున్నారు. సర్వర్ సమస్యతో చాలా సమయం అక్కడే ఉండాల్సి వస్తుందని, చౌక దుకాణం నుంచి సరుకులు తీసుకోవడం వలన నిరీక్షించాల్సి వస్తోంది. దీనివల్ల కూలీనాలి చేసుకునే అవకాశం కూడా లేకుండా పోతుందని ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే వచ్చి సరుకులు ఇచ్చేవారని అన్నారు. ఇప్పుడు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఇళ్ల వద్దకే చౌక దుకాణ సరుకులు సరఫరా చేస్తే బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

డ్రోన్ కెమెరాలతో అసాంఘిక కార్యకలాపాలకు చెక్

ప్రజాశక్తి - రేణిగుంట: తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు శుక్రవారం ఎస్సై నాగరాజు, సిబ్బందితో కలిసి రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రోన్ కెమెరాల సహాయంతో ఖాళీ స్థలాలను, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం, గంజాయి వినియోగం, మల్లిమడుగు రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో ఇతర అసాంఘిక కార్యకలపాలను గుర్తించామని తెలిపారు. నేరాలు అరికట్టడమే డ్రోన్ తనిఖీ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

డాక్యుమెంటు దారిపోయినది

ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా మా ఈ క్రింది ఇంటి జాగాకు సంబంధించిన **ఒరిజినల్ లింకు డాక్యుమెంటు నెం.5179/2010, తేది. 04-10-2010** (సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్,చిత్తూరు) నేను పాచిగుంట నుండి చితూరు బస్సులో వస్తున్న సందర్భంగా దారిపోయినవి. అవి ఎంత వెతికినా దొరకలేదు. ఎవరకైనా సదరు డాక్యుమెంటు దొరికన ఎడల ఈ క్రింది చిరునామాలో అందచేయగలరు.

ఆస్తి షెడ్యూలు

చిత్తూరు జిల్లా, చిత్తూరు మండల పరిషత్, 73 మంగ సముద్రం గ్రామ పంచాయితీ నందు గల గ్రామ కంఠం సర్వే నెం.317 లో గల భూమి లో ప్లాటు నెం 246 గా గల ఇంటి ఖాళీ జాగా.

టి హంస, W/o ఎం.రాజేష్
బుక్కాపట్నం గ్రామం, వరత్తూరు పోస్టు,
జి.డి.నెల్లూరు(మం),చిత్తూరు జిల్లా